క్లుప్తంగా

అందరి సహకారం అవసరం



మాట్లాడుతున్న లింగమూర్తి

హుస్నాబాద్: పుస్తకాలు కొనుగోలు చేయడానికి వ్యాపారులు, ఉద్యోగులు విరాళాలు అందించి గ్రంథాలయ అభివృద్ధికి సహకారం అందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి కోరారు. జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా మంగళవారం దేశ గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో కొత్తగా రూ.80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరాయన్నారు.

'మోడల్'లో మాక్ పోలింగ్



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హుస్నాబాద్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక మోడల్ స్కూల్లో మంగళవారం మాక్ పోల్ నిర్వహించారు. ఓటువేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్‌బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ గరల్స్‌ను ఎన్నుకున్నారు. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు దోహదం



ఐఎఫ్‌పీ స్క్రీన్ ప్రారంభిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల ప్రాథమిక పాఠశాలలో ఐఎఫ్‌పీ స్క్రీన్ బోర్డులను మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందేందుకు ఈ స్క్రీన్ బోర్డు ఎంతో దోహదపడుతుందన్నారు. హెచ్‌ఎం జయప్రకాశ్‌రెడ్డి రూ.5 లక్షల సొంత ఖర్చులతో ఈ స్క్రీన్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహాయ సహకారాలు అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంఎన్ఓ పెద్ది విఠల్, ఉపాధ్యాయులు రమణ, భూలక్ష్మి, జ్యోతి, స్వప్న, సుజాత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

గడువు పెంచండి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుస్నాబాద్: రైతుబీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోడానికి గడువును మరింత పెంచాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి కోరారు. గడువు పెంచే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని మంగళవారం ఆర్డీఓ రామ్మూర్తికి బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారని, ప్రభుత్వం గడువును పెంచి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్యాం సుందర్‌గౌడ్, వికాస్ యాదవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా శీత్లా పండుగ



అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు ఊరేగింపుగా తరలివెళ్తున్న తండా వాసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మసిరెడ్డితండాలో గిరిజనులు శీత్లా పండుగను ఘనంగా నిర్వహించారు. గిరిజన యువతులు, మహిళలు, యువకులు శీత్లా భవానికి నైవేద్యం సమర్పించేందుకు మంగళవారం డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. రాజునాయక్, మోహన్‌నాయక్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

విస్తరిస్తున్న బెజ్జంకి సహకారం



బెజ్జంకిలో రూ.3 కోట్లతో నిర్మించిన సహకార సంఘ భవనం

- కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా రుణాలు
- రూ.3 కోట్లతో వాణిజ్య సముదాయం
- త్వరలో కేడీసీసీ బ్యాంకు ప్రారంభం
- ఐదేళ్లలో రూ.7.50 కోట్ల ఆదాయం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి సహకార సంఘం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా రైతులకు రుణాలు అందిస్తూ జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. రూ.3 కోట్లతో అధునాతన హంగులతో నిర్మించిన వాణిజ్య సముదాయం, ఏసీ ఫంక్షన్ హాల్, సంస్థ కార్యాలయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గతంలో ప్రారంభించారు. సుమారు కోటి రూపాయలతో నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ నూతన భవనాన్ని త్వరలోనే మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, జిల్లా చైర్మన్ కొండూరి రవీందర్‌రావులు ప్రారంభించనున్నట్లు చైర్మన్ తన్నీరు శరత్‌రావు ఇప్పటికే ప్రకటించారు.

రూ.7.50 కోట్ల ఆదాయం

సహకార సంఘం ఆధ్వర్యంలో వరి, సన్‌ఫ్లవర్, మొక్కజొన్న తదితర పంటలను కొనుగోలు చేశారు. సంస్థకు చెందిన పెట్రోల్ పంపులు పలు కారణాలతో గతంలో మూతపడగా ఇటీవల పునః ప్రారంభించారు. అలాగే రైతులకు ఎరువులు విక్రయించారు. వీటి ద్వారా యేటా రూ.కోటికిపైగా ఆదాయం సమకూరుతుంది. ఈ ఐదేళ్లలో రూ.7.50 కోట్ల లాభాలు ఆర్జించారు. అందుకే ఈ సహకార సంఘం నిర్వహణను ఈశాన్య రాష్ట్రాల సహకార సంఘాల ప్రతినిధులు, నాబర్డ్ బృందం గతంలో పరిశీలించాయి. మంచి లాభాలతో అభివృద్ధిలో పథంలో సంఘం కొనసాగుతున్నందుకు వారు అభినందించారు.

ప్రోత్సాహకంగా రూ.3 లక్షల అందజేత

బెజ్జంకి సహకార సంఘం అభివృద్ధిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌పీఓ ఫార్మర్ ప్రమోషన్ కింద రూ.3 లక్షల చెక్కు విడుదల చేసింది. దానిని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ చేతుల మీదుగా చైర్మెన్ తన్నీరు శరత్‌రావుకు అందజేశారు.

రూ.32 కోట్ల మేర రుణాలు

సహకార సంఘం సభ్యులకు పంట రుణాలు, తాకట్టు, గృహ నిర్మాణం, వాహన కొనుగోళ్లకు దీర్ఘకాలిక రుణాలు అందజేసింది. అంతేకాకుండా బంగారంపై కూడా రుణాలు, లాకర్ సదుపాయం కల్పించింది. ప్రతి యేటా మంజూరు చేస్తున్న రుణాలు శత శాతం వసూలుచేసి ఆదర్శంగా నిలిచింది. గతంలో రూ.8 కోట్ల మేర రుణాలిచ్చిన సంస్థ నూతన పాలకవర్గంలో రూ.32 కోట్ల రుణాలు అందించారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కేడీసీసీ బ్యాంకు

అందరి సహకారంతోనే అభివృద్ధి



సభ్యులు, పాలకవర్గ సభ్యుల సహకారంతోనే బెజ్జంకి సహకార సంఘం అభివృద్ధి పథంలో నడుస్తోంది. అలాగే రైతులు కూడా వారు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం ఎదుగుదలకు సహకరించారు. రైతులకు ఉపయోగపడేలా మరింతగా కృషి చేస్తాం. అంతేకాకుండా సంఘం అభివృద్ధికి ప్రభుత్వాల సహకారం కూడా అందడం అభినందనీయం

– చైర్మన్ తన్నీరు శరత్‌రావు



చేర్యాల(సిద్దిపేట): ముస్త్యాల మోడల్ స్కూల్‌లో తరగతులను బహిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటును కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతగా జరిగింది. నాలుగు మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలతోపాటు పట్టణ కేంద్రాల్లోని కళాశాలలు విద్యార్థులు, యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

చేర్యాల(సిద్దిపేట)/కొమురవెల్లి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): చేర్యాలలో జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్ మాట్లాడారు. ప్రత్యేక డివిజన్ సాధించడానికి నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందన్నారు. నాలుగు మండలాల పరిధిలోని మారుమూల గ్రామాలైన కొండాపూర్, కూటిగల్ తండాలు మొదలుకొని గురువన్నపేట, తపాస్‌పల్లి వరకు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలతో పాటు పట్టణ కేంద్రంలోని కళాశాలలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాలయాపన చేయకుండా చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. బంద్‌కు సహకరించిన విద్యాసంస్థల యజమాన్యాలు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జేఏసీ నాయకులు అశోక్, బీరయ్య, సత్యనారాయణ, చంద్రం, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లింగం తదితరులున్నారు. అదే విధంగా కొమురవెల్లిలో జేఏసీ నాయకులు కుడిక్యాల బాలమోహన్, బూర్గు సత్తయ్య, మల్లం అంజయ్య తదితరులు పాఠశాలలకు వెళ్లి తరగతులు బహిష్కరించారు. బంద్‌కు సహకరించిన ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మద్దూరులో జేఏసీ నాయకులు పాఠశాలలకు వెళ్లి తరగతులు బహిష్కరించారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ర్యాగింగ్ వద్దు.. స్నేహభావమే ముద్దు

త్రీటౌన్ సీఐ విద్యాసాగర్



అవగాహన కల్పిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: ర్యాగింగ్ జోలికి వెళ్లకుండా విద్యార్థులంతా స్నేహపూర్వకంగా కలిసిమెలసి మెలగాలని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ పిలుపునిచ్చారు. మిట్టపల్లిలోని సురభి మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్ చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులతో అసభ్యంగా, అమానుషంగా ప్రవర్తించడం, ఇబ్బందులకు గురి చేయడం మంచిదికాదని, ర్యాగింగ్‌కు పాల్పడి కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ నాశనం అవుతుందని హెచ్చరించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వెంటనే కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని, ధైర్యంగా ఎదుర్కొని ర్యాగింగ్‌ను రూపుమాపాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బతాయి, ప్రిన్సిపాల్ రమణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, డీన్ రఫి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ శ్యాంరావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి అమృత్, పీఆర్వో పరశురామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కలలను సాకారం చేసుకోవాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులు ఇష్టపడి చదువుకుని తమ కలలను సాకారం చేసుకోవాలని ఎస్ఐ కృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని ఇటిక్యాల ఉన్నత పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో మహిళ చట్టాలు, సైబర్ నేరాలు, భవిష్యత్ మార్గాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మాధవరెడ్డి, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అస్తిత్వ' కెరటం అనిశెట్టి రజిత

తెలుగు పండితుడు సంపత్‌కుమార్‌రెడ్డి



రజిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలుగా సేవలందించిన అనిశెట్టి రజిత తెలంగాణ సాహిత్య అస్తిత్వ కెరటమని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల వరంగల్‌లో గుండెపోటుతో మరణించిన ఆమె మృతికి స్థానిక కళాశాలలో మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. అధ్యాపకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనిశెట్టి రజిత ఆకస్మిక మృతి చాలా బాధాకరమన్నారు. రజిత ఒక నిత్యచైతన్య కెరటమని, సాహిత్య సంస్థలను నడపడంలో, ఉద్యమశక్తిని జాగృతం చేయడంలో ఆమెకు ఎవరూ సాటిరారని కొనియాడారు. అధ్యాపకులు పిట్లదాసు, నారోజు వెంకటరమణ, నరేశ్, రామస్వామి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రజిత మృతి తీరని లోటు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా స్వామిక రచయితల వేదిక జాతీయ అధ్యక్షురాలు కవి, రచయిత, ప్రజా గాయకురాలు అనిశెట్టి రజిత గుండె పోటుతో మృతి చెందడం బాధాకరమని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మిరుదొడ్డిలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాకవి కాళోజీ నుంచి ధిక్కార స్వరాన్ని అలవర్చుకుని ప్రజా ఉద్యమ కార్యకర్తగా మారిన రజిత మృతి తీరని లోటన్నారు. తెలంగాణ ఉద్యమంలో సైతం క్రియాశీలకంగా పాల్గొన్నారని గుర్తుచేశారు. అసమానతకు వ్యతిరేకంగా నిర్వహించే పోరాటాలే ఆమెకు నిజమైన నివాళన్నారు.

మంజీరా రచయితల సంఘం సంతాపం

సిద్దిపేట(ప్రశాంత్‌నగర్): ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత మరణం బాధాకరమని ఆమె మరణంపై మంజీరా రచయిత సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సాహిత్య అకాడమీ మాజీ చైర్మెన్ నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మరసం జిల్లా అధ్యక్షుడు రంగాచారి తదితరులు మంగళవారం మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కవిత్వంతో తన పాత్ర పోషించారని కొనియాడారు.

కాంగ్రెస్‌తో రైతులకు తప్పని కష్టాలు

- బీఆర్ఎస్ నాయకుల నిరసన
- తహసీల్దార్, వ్యవసాయాధికారికి వినతిపత్రాలు అందజేత



సిద్దిపేటరూరల్: ఏఓ పరశురాంరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటరూరల్: రైతులకు సకాలంలో యూరియా అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కష్టాల పాలు చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. రైతులకు సకాలంలో తగినంత యూరియాను అందించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేడు రైతులు యూరియా కోసం చెప్పులు వరుసలో పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ రైతులపై లేదని ఎద్దేవా చేశారు. తహసీల్దార్, వ్యవసాయ అధికారికి వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎల్లం, ఆంజనేయులు, ఎల్లారెడ్డి, సంతోష్, పరశురాములు, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కార్యాలయం ఎదుట

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పీఏసీఎస్ కార్యాలయం ఎదుట యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరిపడా యూరియా పంపిణీ చేయడంలో అధికారుల వైఖరిపై మండి పడ్డారు. యూరియా అందుబాటులో ఉంచకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

విఫలమైన ప్రభుత్వం

తొగుట(దుబ్బాక): రైతులకు సరిపడా యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో రైతులతో కలిసి మంగళవారం ఆయన మాట్లాడారు. బస్తా యూరియా కోసం రైతులు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుచేసిన పత్తి, మొక్కజొన్న, వరి పంటలకు అదును దాటిన తర్వాత ఎరువులు వేసినా ప్రయోజనం ఉండదని వాపోయారు. సరిపడా యూరియా అందించక పోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదు

కొండపాక(గజ్వేల్): అసలే సకాలంలో వర్షాలు కరవక అరకొరగా వ్యవసాయం నెట్టుకొస్తున్న రైతన్నలకు యూరియా అందించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం సిగ్గుచేటని రైతు బంధు సమితి రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు దేవిరవీందర్ మండిపడ్డారు. కుకునూరుపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో తగినంత యూరియా లేకపోతే పంటల్లో ఎదుగుదల ఉండదని వాపోయారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు విపరీతంగా పెంచడంతోపాటు యూరియా కొరత సృష్టించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో పీఏసీఎస్ కార్యాలయం ఎదుట బారులు తీరిన రైతులు

ఉద్యాన వర్సిటీలో వర్క్‌షాపు

ములుగు(గజ్వేల్): 'భవిష్యత్‌లో ఆహార భద్రతా సవాళ్లు, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్, కృతిమ మేధస్సు సాధనాలు' అనే అంశంపై ములుగు ఉద్యాన వర్సిటీలో వైస్ చాన్స్‌లర్ డాక్టర్. దండా రాజిరెడ్డి అధ్యక్షతన మంగళవారం అంతర్జాతీయ వర్క్‌షాపు నిర్వహించారు. ఆహార భద్రత సవాళ్లు వాటిని ఎదుర్కోవడానికి వ్యవసాయం, ఆహారంలో మార్పు తేవడం, కృతిమ మేధ వినియోగం తదితర అంశాల గురించి చర్చించారు. ప్రొఫెసర్ పీవీ వరప్రసాద్, ఉద్యాన వర్సిటీ అధికారులు భగవాన్, శ్రీనివాసన్, సురేశ్‌కుమార్, విజయ తదితరులు పాల్గొన్నారు.

'చెత్త' శుద్ధి ఏదీ?

గురుకుల ప్రిన్సిపాల్‌పై కలెక్టర్ హైమావతి ఆగ్రహం



పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కలెక్టర్

సిద్దిపేటఅర్బన్: మండలంలోని ఎన్సాన్‌పల్లిలోని తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంపై కలెక్టర్ హైమావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆమె ఫైరయ్యారు. శానిటరీ సిబ్బందిని పిలిపించి మొత్తం శుభ్రంచేసే వరకు వారితో ఉండి పర్యవేక్షించారు. పాఠశాల ఆవరణ, వసతి గృహంలో ప్రతిరోజు తప్పనిసరిగా శుభ్రం చేయాలని ఆదేశించారు. చెత్తవల్లవిద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడతారని తెలియదా? అంటూ ప్రిన్సిపాల్‌పై మండిపడ్డారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డిని ఫోన్‌లో ఆదేశించారు. అలాగే అదే ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మెస్‌ను పరిశీలించారు. బండలపై చేరిన మురికిని సిబ్బంది చేత శుభ్రం చేయించారు. వంట గది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ప్రిన్సిపాల్ మాయన్ మార్తాను హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేటఎడ్యుకేషన్: డిగ్రీ, పీజీలో దూరవిద్య ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం స్థానిక కళాశాలలో కోఆర్డినేటర్ శ్రీనివాస్‌తో కలిసి ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత ఆవిష్కరించారు. పూర్తి వివరాలకు 9440884 089 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, దాసు, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, లీలావతి, రాణి తదితరులు పాల్గొన్నారు.

◆ బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

గజ్వేల్‌రూరల్: బైక్ అదుపు తప్పి ఇద్దరు గాయపడిన ఘటన ప్రజ్ఞాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ప్రజ్ఞాపూర్‌కు చెందిన సురేశ్ మరో యువకుడితో కలిసి బైక్‌పై మంగళవారం హైదరాబాద్‌వైపు వెళ్తుండగా రింగురోడ్డుపై బైక్ అదుపు తప్పింది. ఈ ఘటనలో గాయపడిన ఇద్దరిని గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు.

◆ గ్రంథాలయాలు జ్ఞాన కేంద్రాలు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో మంగళవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞాన కేంద్రాలని, నిరంతర అభ్యసనానికి ఆధారాలన్నారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ డాక్టర్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, సీఓఈ గోపాలసుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

◆ మున్సిపల్ కమిషనర్ తనిఖీలు

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ మంగళవారం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మాంస విక్రయదారులు తప్పనిసరిగా స్లాటర్ హౌస్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరుబయట మేకలు వధిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. బుస్సపూర్ డంప్ యార్డ్ సందర్శించారు.

◆ సీతారాం ఏచూరి జీవితం ఆదర్శం

దుబ్బాక: సీతారాం ఏచూరి జీవితం అందరికీ ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్ అన్నారు. ఏచూరి జయంతి సందర్భంగా దుబ్బాకలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రారెడ్డి, సవీన, భాస్కర్, సాదిక్, రాజు, లక్ష్మీనర్సయ్య తదితరులు ఉన్నారు.

◆ దాతల వితరణ

వర్గల్(గజ్వేల్): మండలంలోని నెంటూరు, చాంద్‌ఖాన్‌మక్త ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం పలువురు దాతలు క్రీడాదుస్తులు అందజేశారు. నెంటూరు స్కూల్ విద్యార్థులకు అజీజ్, చంద్రం యాదవ్ వితరణ చేయగా, మక్త పాఠశాల విద్యార్థులకు దివంగత దేవులపల్లి కేశవరావు స్మారకార్థం ఆయన స్నేహితుడు శ్రీనివాస్‌రెడ్డి వితరణ చేశారు. రంగారెడ్డి, విజయమోహన్ పాల్గొన్నారు.

◆ ఉచిత ఇసుక అందటం లేదు

హుస్నాబాద్: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక అందటం లేదని బీఎస్పీ నాయకులు వాపోయారు. ఇసుక ధరలను నియంత్రించాలని మంగళవారం ఆర్డీఓ రామ్మూర్తికి వినతి పత్రం ఇచ్చారు. రవీందర్ గౌడ్, శంకర్, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ క్రీడా దుస్తులు అందజేత

నంగునూరు(సిద్దిపేట): దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు సహాయం అందించాలని ఎంఈఓ దేశిరెడ్డి కోరారు. అప్పలాయిచెర్వు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రవి, భాస్కర్‌రెడ్డిలు వారి సొంత ఖర్చులతో 24 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేశారు. అలాగే స్థానిక బీఆర్ఎస్ నాయకుడు గట్టు శ్రీను పాఠశాల అభివృద్ధి కోసం రూ.5 వేలు అందజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

◆ సైనికుల సేవలు మరువలేనివి

బెజ్జంకి(సిద్దిపేట): దేశం కోసం సైనికులు చేస్తున్న సేవలు మరువలేనివని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి అన్నారు. హర్‌ఘర్ తిరంగాలో భాగంగా రామసాగరంలో రిటైర్డ్ సైనికుడు మల్లేశం, రైతు ఇంగాల భూపతిరావును మంగళవారం సన్మానించారు. రాజు, మల్లేశం, రాములు, వేణు, రవి తదితరులు పాల్గొన్నారు.

నూతన సంఘాల ఏర్పాటుకు కృషిచేయాలి

ఏపీఎం తిరుపతి



హుస్నాబాద్‌రూరల్: మాట్లాడుతున్న ఏపీఎం తిరుపతి

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లో నూతన మహిళా స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలని ఏపీఎం తిరుపతి సూచించారు. ఐకేపీ కార్యాలయంలో మంగళవారం సీఏలతో సమావేశం నిర్వహించి సంఘాల ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళను సంఘంలో చేర్చుకోవడానికి ప్రభుత్వం కిశోర బాలికల సంఘాల ఏర్పాటుకు అవకాశం ఇచ్చిందన్నారు. గ్రామాల్లో కిశోర బాలికలను గుర్తించి స్వశక్తి గ్రూపులు ఏర్పాటు చేయాలని, వృద్ధ మహిళలను కూడా సంఘాలలో చేర్చుకోవాలని సూచించారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వాటిని ప్రతి ఇంటికి చేర్చి ఆర్థిక ప్రగతిని సాధించాలని కోరారు. సమావేశంలో సీసీలు పాల్గొన్నారు.

వర్గల్‌లో..

వర్గల్(గజ్వేల్): కేటగిరీల వారీగా ప్రతి మహిళా.. సంఘ సభ్యురాలిగా ఉండేలా నూతన సంఘాలు నియమించాలని ఎంపీడీఓ మచ్చేందర్, ఐకేపీ ఏపీఎం కిరణ్‌కుమార్ సూచించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులనుచేసే కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామసంఘ వీఓఏలు, పదాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కేటగిరీలుగా నూతన సంఘాల ఏర్పాటుపై ఏపీఎం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరిత, సీసీలు సత్యనారాయణ, నర్సింహులు, రమేశ్, సాయిలు, పద్మలత తదితరులు పాల్గొన్నారు.